## ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

ధర్పల్లి, డిసెంబర్ 18 : మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటి పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఎంపీవో రాజేశ్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి సైపుద్దీన్, కార్యదర్శులు, పంచాయతీ బృందంతో కలిసి మండలకేంద్రంలో సోమవారం ఇంటి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. ధర్పల్లిలో ఇంటి పన్ను వసూళ్లు పూర్తి కావచ్చాయని, మిగిలిన కొద్ది శాతం మేర పన్నును పూర్తిస్థాయిలో వసూలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది శ్యామ్‌దర్, గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

ధర్పల్లి, డిసెంబర్ 18 : బీఎల్‌వోలుగా పని చేసే ప్రతిఒక్కరూ బూత్ స్థాయిల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 17 ఏండ్లు పైబడిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఓటరు జాబితాలో ఫొటో స్పష్టంగా లేని వారి నుంచి కొత్త ఫొటోను సేకరించి, వివరాలను నమోదు చేయించాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టి, తప్పులు లేని తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8వ తేదీలోగా సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో రాజేశ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## చాంద్‌మియాబాగ్ తండాలో వికసిత భారత సంకల్పయాత్ర



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 18 : మండలంలోని చాంద్‌మియాబాగ్ తండాలో వికసిత భారత సంకల్పయాత్రను సర్పంచ్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అధికారులు, నాయకులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, సర్పంచ్ కిషన్‌నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏపీవో రవి, ఏపీఎం రవీందర్, వ్యవసాయాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## చందూర్‌లో పారిశుద్ధ్య పనులు

చందూర్, డిసెంబర్ 18 : మండలకేంద్రంలో పంచాయతీ కార్మికులు సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో డ్రైనేజీలను శుభ్రం చేశారు.

## సత్సంగ్ మిషన్ ఆధ్వర్యంలో ఆటలపోటీలు

చందూర్, డిసెంబర్ 18 : మండలంలోని ఘన్‌పూర్‌లో సత్సంగ్ మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్సంగ్ సభ్యుడు నీలి సంజీవ్, యువకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇందల్వాయి, డిసెంబర్ 18 : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బీబీపూర్ తండా కాన్వూర్ దాబా వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సురేంద్ర (45) ఆదివారం రాత్రి దాబాకు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సురేంద్రను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు ములాయంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### చికిత్సపొందుతూ మహిళ..

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 18 : జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై చర్చి ఎదుట ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో జక్రాన్‌పల్లికి చెందిన పూజారి మనీషా తీవ్రగాయాల పాలయ్యింది. ఆమెను జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ప్రభుత్వ పెన్షనర్స్ డే సందర్భంగా క్రీడల నిర్వహణ

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : ఆలిండియా పెన్షనర్స్ డేను పురస్కరించుకొని రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా మున్సిపల్ కమిషనర్ మకరంద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ హాజరయ్యారు. అనంతరం 80 సంవత్సరాలు దాటిన 25 మంది వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్, జిల్లా కోశాధికారి ఆశయ్య, రాజారాం, జగత్‌రెడ్డి, తుల భూమన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సాయిలు, దారం గంగాధర్ పాల్గొన్నారు.

# ‘ప్రజావాణి’ కి 66 ఫిర్యాదులు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 66 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఆర్డీవో చందర్, ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యలపై ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేయాలని, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

# బాజిరెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



బాజిరెడ్డి గోవర్ధన్‌తో ఇందల్వాయి మండల బీఆర్ఎస్ నాయకులు

నిజామాబాద్ రూరల్/ ఇందల్వాయి/ మోపాల్ (ఖలీల్‌వాడి), డిసెంబర్ 18 : రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, ఇందల్వాయి నాయకులు, కార్యకర్తలు జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం కలిశారు. అధికారం కోల్పోయామని కార్యకర్తలు ఆవేదన చెందవద్దని, తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. త్వరలో జరగనున్న ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బాజిరెడ్డిని కలిసిన వారిలో రూరల్, డిచ్‌పల్లి మండలాల బీఆర్ఎస్ అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, చింత శ్రీనివాస్‌రెడ్డి, గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, నాయకులు జలాల్‌పూర్ శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, జమీర్‌ఖాన్, అజీమ్, రాములు, ఇందల్వాయి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు లక్ష్మీనర్సయ్య, కో-ఆప్షన్ సభ్యుడు నయీం, సర్పంచ్ తెలు గణేశ్, మారుపాక సాయిలు ఉన్నారు.

నగర శివారులోని గూపన్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజన్న సతీమణి మృతిచెందగా బాజిరెడ్డి గోవర్ధన్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. బాజిరెడ్డి వెంట కార్పొరేటర్ చిటికెల శ్రీనివాస్‌రెడ్డి, డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, కేసీఆర్ సేవాదళ్ రూరల్ సెగ్మెంట్ కన్వీనర్ కొర్వ దేవేందర్ ఉన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు

మోపాల్ మండలంలోని బోర్గాం(పీ)లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు.



పడిపూజలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

ఇందల్వాయి, డిసెంబర్ 18 : మండలంలోని గన్నారంలో అయ్యప్ప సామూహిక మహా పడిపూజను అల్లాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామంలో ఉదయం ఆరట్టు కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకపూజల అనంతరం మాలధారులు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి గుద్దేటి నర్సయ్య, గంగారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇందల్వాయి, డిసెంబర్ 18 : మండలంలోని తిర్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు చట్టాలు, షీ టీముల పనితీరు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పరిసరాల శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరి, చైతన్య, వనజ, శారద, బాబు, ఆసిఫ్, స్రవంతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గూపన్‌పల్లి పాఠశాలలో ఉన్నతి కార్యక్రమం

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 18 : నగర శివారులోని గూపన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్నతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నతి రాష్ట్రస్థాయి పర్యవేక్షణ బృందం సభ్యుడు లక్ష్మీనాథం హాజరై వివిధ బోధనాంశాల రికార్డులు, పాఠ్యాంశాల బోధన, ప్రగతి రికార్డులు, పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో వారి తరగతికి సంబంధించిన అన్ని రకాల సామర్థ్యాలను సాధించడమే లక్ష్యంగా ఉన్నతి కార్యక్రమం రూపొందించడం జరిగిందని, ఉపాధ్యాయులకు బోధనలో ఎంతో సహాయకారిగా ఉన్న ఈ కార్యక్రమం అమలుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శకుంతలా దేవి, ఉపాధ్యాయులు జయసాగర్, కృష్ణారెడ్డి, అంజయ్య, శ్రీరాంలక్ష్మణ్, ఉమాదేవి పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ పండుగ

సిరికొండ, డిసెంబర్ 18 : మండలంలోని మైలారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ 27వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు డప్పువాయిద్యాల మధ్య బోనాలను ఊరేగింపు అమ్మవారికి సమర్పించారు. హోమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## న్యాక్ సర్టిఫికెట్లు, పెండింగ్ అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 18 : భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ పూర్తయిన అనంతరం వారికి ఇవ్వాల్సిన పారితోషకం, సర్టిఫికెట్లను న్యాక్, కార్మికశాఖ అధికారులు వెంటనే అందజేయాలని బీఆర్ఎస్ నాయకుడు మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. 2022 డిసెంబర్ 12న శిక్షణ పూర్తిచేసుకొని ఏడాది గడుస్తున్నా.. ఇప్పటి వరకు సర్టిఫికెట్లు, పారితోషకం అందజేయలేదని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు సంజీవ్, శివకుమార్, హైదర్, సారిక, అరుణ్ పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 9.4 కేజీల క్లోరల్ హైడ్రేట్ స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీసీ దశరథ్

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 18 : డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడులు నిర్వహించింది. కల్తీ కల్లు తయారు చేసే క్లోరల్ హైడ్రేట్ (మత్తు పదార్థాన్ని) సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీసీ దశరథ్ వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగ్గేపల్లి గ్రామంలోని కాయల రామాగౌడ్ ఇంటిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు స్వప్న, వెంకటేశ్ సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. రూ.50 వేల విలువ చేసే 9.4 కేజీల క్లోరల్ హైడ్రేట్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం సదరు వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తుపదార్థాలను స్మగ్లింగ్ చేసినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిబ్బంది నారాయణ, హమీద్, శివ, భోజన్న, అవినాష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.